# పాపం చంటబ్బాయ్

-బద్దన మస్తాన్‌బాబు



పొడుగ్గా ఉన్న ఒక దుంగకు అద్దాన్ని తగిలించి 'షేవింగ్‌కి' రంగం సిద్ధం చేసుకుంటున్నాడు చంటబ్బాయ్. మనవాడికి మతిమరపు జాస్తి. అది ఎలాంటిదంటే రేజర్‌లో బ్లేడ్ పెట్టకుండా షేవింగ్ చేసుకోవడం. ఇప్పుడు జరిగింది కూడా అదే.



అయితే అది తన తప్పు కాదన్నట్లు చిన్న స్మైల్ ఒకటి విసిరి రేజర్‌లో బ్లేడ్ పెట్టి రెడీచేసి, నెక్స్‌ట్ స్టెప్‌గా పల్లెటూరి కంకర్రరోడ్డులా ఉండే తన మొఖాన్ని చూసి అరవబోయి అది తన ప్రతిబింబమేనని గుర్తొచ్చి తమాయించు కున్నాడు.

'ఎప్పుడూ ఇంతే! చిలిపి!' అనుకుంటూ తనను తానే మందలించుకుని, సిబ్బంది నిర్లక్ష్యానికి గుర్తుగా పార్కులో పెరిగిన కలుపు మొక్కగుబురులా ఉన్న గడ్డానికి 'క్రీమ్' రాసి నానాతంటాలు పడి ఎలాగయితేనేం షేవింగ్ అయ్యిం దనిపించాడు.

స్నానం చేసి ఫ్రెష్ అవుతూ అనుకున్నాడు ఎలాగయినా ఈరోజు తన భార్యకు మల్లె పూవులు తీస్కురావాలని, కానీ పాపం అదేందురదృష్టమో, ఎంత ప్రయత్నించినా వారం రోజుల నుండీ మనవాడికి మార్కెట్లో మల్లెపువ్వులే కనబడ లేదు. అందుకే ఈరోజు ఒక గట్టి నిర్ణయమే తీసుకున్నాడు. ఎల్గాగయినా సరే ఈ రోజు మల్లెపువ్వులతోనే తిరిగి రావాలనుకుని. లేడికి లేచిందే పరుగన్నట్లుగా బయలుదేరాడు.

రోడ్డు మీద కనబడిన చిన్న చిన్న కంకర రాళ్ళను తన్నుతూ హుషారుగా నడుస్తున్నాడు. అతడి తాకిడికి అల్లంతదూరానికి ఎగిరి పడ్తోన్న ఆ రాళ్ళను ఏనుగు దంతాళ్ళు ఉన్న అతడి కాలి బొటనవేళ్ళ గోళ్ళను విస్తుపోయి చూస్తున్నారు. దారినపోయే దాన(మ్మ)య్యలు.

అదేమీ పట్టించుకోని మన చంటబ్బాయ్ నడుస్తూనే ఉన్నాడు. ఇంతలో 'మల్లెపువ్వులో' అనరుస్తూ బుట్టను నెత్తిన పెట్టుకుని ఒక 'పూబోణి' ఎదురుగా వెళుతూ కన్పించింది.

అంతే! వెదకబోయిన తీగ తగలటమేమోగానీ, మనవాడి కాలుకి మాత్రం ఒక పెద్ద బండరాయి తగిలింది. తూలి ముందుకు పడబోయి బలవంతాన నిలదొక్కుకుని పరిగెత్తుకెళ్ళి ఆ అమ్మాయి ముందు నించుని ఆయాసంతో..

"బు... బుట్టెంత?" అనడిగాడు.

అతగాడి వాలకానికి ఆశ్యర్యంతో నోరు పెద్దది చేసి నిలబడిపోయిందా అమ్మాయ్.

ఆమె ఇంకా తేరుకోకముందే నెత్తిమీదున్న మల్లె పువ్వుల బుట్టను తీస్కుని, పదిరూపాయలనోట్లు ఓ పది ఆమె చేతిలో పెట్టి వెనుదిరిగి చూడకుండా పరిగెత్తాడు చంటబ్బాయ్.

'పాపం ఏ ఆడకూతురి ఒళ్ళో ఈ రాత్రికి హూనం అయినట్లే' అని మనసులోనే అనుకుంది ఆశ్చర్యం నుండి తేరుకున్న పూలమ్మాయ్.

సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతూ మల్లెపువ్వుల బుట్టను మరోసారి చూసుకుంటున్న చంటబ్బాయ్ ఏదో. డౌటొచ్చినవాడిలా ఒక్కసారిగా ఆగిపోయాడు ఆ నడి రోడ్డు మీద.

తనలో తానే అనుమానపడుతూ గాను కున్నాడు. "అవునూ... ఈ పూలు పెట్టాలంటే భార్య కావాలి. భార్యరావాలంటే పెళ్ళి చేసుకోవాలి! మరి తనకు పెళ్ళి కాలేదుగా" అంతే! మల్లెపూల బుట్ట అతనిచేతిలో నుండి దబ్బున క్రిందికి జారింది!

బుద్ధన మస్తాన్‌బాబు
ఇం.నం. 16/478, జోస్యులవారితోట,
చిలకలపూడి (పోస్ట్)
మచిలీపట్నం - 521 002.
కృష్ణాజిల్లా.